# రేవంత్ పాలనలో తెలంగాణలో చీకట్లు

- 11 నెలల్లో సర్వం కోల్పోయిన సబ్బండవర్గాలు
- అల్లాడుతున్న పల్లెలు.. రైతుల చేతికి బేడీలు
- ఏ హోదాలో తిరుపతిరెడ్డి భూములు సేకరిస్తమంటున్నడు
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు
- 'జాగో తెలంగాణ' అంటూ పిలుపు

హైదరాబాద్, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): కేసీఆర్ పాలనలో పదేండ్లు వెలుగుల్లో బతికిన తెలంగాణ, రేవంత్ పాలనలో చీకట్లు అలుముకున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. పాడి పంటలు, పసిడి సంపదలతో కళకళలాడిన పల్లెలు పోలీసు బూట్ల చప్పుళ్లతో అల్లాడుతున్నాయని ఎక్స్ వేదికగా ఆందోళన వ్యక్తంచేశారు. జేబునిండా డబ్బులతో దర్జాగా బతికిన రైతన్నను కాంగ్రెస్ సర్కారు బేడీలు వేసి ఠాణాల చుట్టూ తిప్పుతున్నదని దుయ్యబట్టారు. రైతుబంధు, రైతుబీమా, 24గంటల ఉచిత కరెంటు, సాగునీరు, పంటల కొనుగోళ్లు చేపట్టి రైతన్నకు కేసీఆర్ సర్కారు వెన్నెముకగా నిలిస్తే, రేవంత్ పాలనలో రైతన్న ఆగమవుతున్నాడని ఉదహరించారు. '11నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ సబ్బండవర్గాలు సర్వం కోల్పోయాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కొనుగోళ్లు లేక రైతులు తండ్లాడుతున్నారు. ఆడబిడ్డలు కల్యాణ లక్ష్మి తులం బంగారం కోల్పోయారు. బాలింతలు అమ్మ ఒడి, కేసీఆర్ కిట్, గొల్ల, కురుమలు సబ్సిడీ గొర్రెలను, దళిత సోదరులు దళితబంధు, మత్స్య సోదరులు ఉచిత చేపపిల్లలను, చేనేత కార్మికులు బతుకమ్మ, క్రిస్మస్ కానుక, రంజాన్ తోఫా చీరల ఆర్డర్లు కోల్పోయి ఆర్థికంగా చితికిపోతున్నారు.'అని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థులు నాణ్యమైన భోజనాన్ని కోల్పోయారని, నిరుద్యోగులు కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోయారని గుర్తుచేశారు. 'కంటివెలుగు ఖతమైంది. ఇంటి వెలుగు మాయమైంది. తెలంగాణ భవిష్యత్ చీకటైంది. జాగో తెలంగాణ' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

### డిఫాక్టో సీఎం తిరుపతి రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి డిఫాక్టో సీఎంగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కొడంగల్‌లో వేలాది ఎకరాల భూములను సేకరిస్తామని తిరుపతి రెడ్డి ఏహోదాలో చెప్తున్నాడని ఆయన ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 'ఏదేమైనా వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. అక్కడ తప్పకుండా ఇండస్ట్రీస్ వస్తయ్. ఫార్మా కంపెనీలే కాదు ఇంకా రకరకాల కంపెనీలు వస్తయ్. పారిశ్రామికంగా ముందుకే పోతం' అని తిరుపతిరెడ్డి పేర్కొనడం దేనికి సంకేతమని పేర్కొన్నారు. తిరుపతిరెడ్డి డిఫాక్టో సీఎంగా వ్యవహరిస్తున్నాడని చెప్పటానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలని తెలిపారు.

### కు.ని పాటించడమే దక్షిణాది చేసిన పాపమా?

కుటుంబ నియంత్రణ పాటించి జాతి హితం కోసం పాటుపడటమే దక్షిణాది రాష్ట్రాలు చేసిన పాపమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. విజయవంతంగా కుటుంబ నియంత్రణ పాటించటంతో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో అన్యాయం అయ్యేలా కావడం దారుణమని టైమ్స్ ఇండియా ప్రచురించిన కథనాన్ని కేటీఆర్ ట్యాగ్ చేసి పైవిధంగా వ్యాఖ్యానించారు.

### • పరేషాన్‌లో పాలమూరు బిడ్డలు..లండన్‌లో నేతలు

"పాలమూరు ప్రజలు, రైతులు రేవంత్‌రెడ్డి పాలనలో పరేషాన్‌లో ఉంటే, అదే జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు ఇతర కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు లండన్ పర్యటనలు చేస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, ఆ నియోజకవర్గ రైతులు ఫార్మా క్లస్టర్లకు వ్యతిరేకంగా తమ భూమి కోసం అరెస్టులకు వెరవకుండా కొట్లాడుతుంటే ఆ జిల్లా మంత్రి, ఇతర నేతలు టూర్లలో ఊరేగడం సిగ్గుచేటని విమర్శించారు.

# పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్

మొదటిపేజీ తరువాయి...

రిమాండ్ విధించింది. దీంతో ఆయనను పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు. రిమాండ్ రిపోర్ట్‌లో మొదట బోగమోని సురేశ్‌ను ఏ1గా పేర్కొన్న పోలీసులు ఇప్పుడు పట్నం నరేందర్‌రెడ్డిని ఏ1గా మార్చారు.

### అక్రమ అరెస్ట్‌పై ఆందోళన వద్దు.. కేటీఆర్ భరోసా

అక్రమ అరెస్ట్‌పై ఆందోళన చెందవద్దని ధైర్యంగా ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి ధైర్యం చెప్పారు. పోలీసులు అరెస్ట్ చేసిన అనంతరం ఆయనతో కేటీఆర్ ఫోన్లో మాట్లాడారు. బీఆర్ఎస్ మొత్తం ఆయన కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో నరేందర్‌రెడ్డి అరెస్ట్‌పై కోర్టులో పోరాటం చేస్తామని, ప్రభుత్వ అప్రజాస్వామిక, నియంతృత్వ విధానాలపై పార్టీ న్యాయపరంగా పోరాటం చేస్తూనే ఉంటుందని తెలిపారు.

### మాజీమంత్రి సబిత ఖండన

పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్‌ను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఖండించారు. నరేందర్‌రెడ్డి సతీమణిని హైదరాబాద్‌లోని వారి ఇంట్లో సబితారెడ్డి పరామర్శించారు. మా భూములు ఇవ్వబోమని రైతులు చెప్తున్నా కేసులు పెట్టి భయపెట్టడం ప్రభుత్వానికి తగదని అన్నారు. ప్రజలను ఒప్పించి నిర్ణయం తీసుకోవాలి కానీ ప్రభుత్వ నిర్ణయాన్ని బలవంతంగా, భయపెట్టి ప్రజల నుంచి భూములను లాక్కోవడం సరి కాదని అన్నారు.

### నరేందర్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యేలు

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని డీటీసీకి తీసుకువచ్చిన నరేందర్‌రెడ్డికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్‌రెడ్డితో పాటు వికారాబాద్, పరిగి నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు తరలివచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్ రెడ్డి డీటీసీలో పోలీసుల అదుపులో ఉన్న నరేందర్‌రెడ్డిని కలిసి ధైర్యం చెప్పారు.



నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

## నరేందర్‌రెడ్డి అక్రమ అరెస్టు దుర్మార్గం

- ప్రజల తరఫున నిలదీస్తూనే ఉంటాం
- ప్రభుత్వంపై హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. పాలన గాలికి వదిలి అరెస్టులు, అక్రమ కేసులు, ముందస్తు నిర్బంధాలు విధిస్తూ రాజకీయ కక్ష తీర్చుకోవడం సిగ్గుచేటని బుధవారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. 'పచ్చని పొలాల్లో ఫార్మాసిటీ పేరిట చిచ్చు పెట్టడమే మీ ప్రజాపాలనా? నడిరాత్రి రైతులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లో పెట్టడమే మీ ఇందిరమ్మ రాజ్యమా? ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు, కేసులు, నిర్బంధాలతో అణిచివేయలేరు. మీ బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ భయపడదు. ప్రజాక్షేత్రంలోనే మిమ్మల్ని ఎండగడతం. అరెస్టు చేసిన పట్నం నరేందర్‌రెడ్డిని, రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

## పూర్తి ఆధారాలతోనే నరేందర్‌రెడ్డి అరెస్టు

ఐజీ సత్యనారాయణ స్పష్టీకరణ



వికారాబాద్, నవంబర్ 13: వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్, అధికారులపై జరిగిన దాడికి సంబంధించి పూర్తి ఆధారాలతోనే కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేసినట్టు హైదరాబాద్ మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వికారాబాద్ కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతూ.. మంగళవారం వరకు ఈ కేసులో భోగమోని సురేశ్ మొదటి నిందితుడు (ఏ1)గా ఉన్నాడని, ఇప్పుడు నరేందర్‌రెడ్డిని ఏ1గా నిర్ధారించి, కోర్టులో హాజరుపర్చామని చెప్పారు. దాడిలో 42 మంది పాల్గొన్నట్టు గుర్తించామని, వారిలో బుధవారం వరకు 21 మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని వివరించారు. మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## రాష్ట్రానికి 'రాహు-రేతు' దోషం

అందుకే రాష్ట్రం అల్లకల్లోలం: సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి 'రాహు-రేతు' దోషం పట్టుకున్నదని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్ రెడ్డి ఎద్దేవా చేశారు. పచ్చగా అలరారుతున్న రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అల్లకల్లోలం జరుగుతున్నదని ఆయన బుధవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. ఓ వైపు వర్గ ఘర్షణలు, మరోవైపు రైతులకు బేడీలు, రాజకీయ కక్ష సాధింపు చర్యలు, జర్నలిస్టులపై దాడులు, కేసులతో రాష్ట్రాన్ని ఎమర్జెన్సీ రోజుల్లోకి తీసుకెళ్లారని దుయ్యబట్టారు. ఫార్మాసిటీకి భూములు ఇచ్చేది లేదని చెప్పిన రైతులపై హత్యాయత్నం కేసులు పెట్టి జైలుకు పంపించడం దుర్మార్గమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని సంపదను దోచుకుని ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో ఖర్చు పెడుతున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చడం లేదని ఆరోపించారు. రైతులు ధాన్యం అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతుండడంతోపాటు గత 11 నెలలుగా రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు తీవ్ర దు:ఖంలో ఉన్నారని పేర్కొన్నారు. ఇదంతా 'రాహు-రేతు' దోష ప్రభావమేనని, ఇందుకు దోష నివారణ చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# ఘటన రోజు ఒకే ఒక్క ఫోన్ కాల్!

- రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి
- 84 సార్లు అంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
- రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేరు ప్రస్తావన

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): నిజం గడపదాటే లోపే అబద్ధం ఊరంతా చుట్టేస్తుందన్న చందంగా లగచర్ల ఘటనలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ అబద్ధపు ప్రచారానికి తెరలేపింది. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కూడా ఈ కేసులోకి లాగారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా పోలీసులు పేర్కొన్న పట్నం నరేందర్‌రెడ్డి, బీ సురేశ్ మధ్య 84 సార్లు ఫోన్ సంభాషణ జరిగినట్టు కాంగ్రెస్ పార్టీ, దాని అనుకూల మీడియా ప్రచారం చేస్తుండగా.. పోలీసుల రిమాండ్ రిపోర్ట్ మరో విధంగా ఉన్నది. సంఘటన జరిగిన రోజున బీ సురేశ్ ఒకే ఒక్కసారి పట్నం నరేందర్‌రెడ్డితో సంభాషించినట్టు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. పోలీసులు పక్కా ప్లాన్‌తో సురేశ్‌కు, నరేందర్‌రెడ్డికి మధ్య నాయకుడు, కార్యకర్తగా ఉన్న సంబంధాన్ని అడ్డంగా పెట్టి కుట్రగా చిత్రీకరించారు. ప్రభుత్వం కొన్నాళ్లుగా బాంబు పేలుతుందంటూ చెప్తూ వస్తున్న నేపథ్యంలో ఈ కేసులో కేటీఆర్ పేరును ప్రస్తావించడం వెనుక ప్రభుత్వ వైఖరిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అధికారులపై దాడి జరిగిన రోజున సురేశ్, నరేందర్‌రెడ్డితో 84 సార్లు మాట్లాడాడని, వీరిద్దరూ కలిసి కుట్ర చేశారంటూ కాంగ్రెస్ పార్టీ, దాని అనుకూల మీడియా అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయి. ఆ ఘటనలో సురేశ్‌ను ముందుంచి, నరేందర్‌రెడ్డి వెనుక నుంచి కథ నడిపించారంటూ లేనిపోని కథలు అల్లారు. రిమాండ్ రిపోర్టులో సెప్టెంబర్ నెల ఒకటో తేదీ నుంచి నవంబర్ 11వ తేదీ మధ్య మొత్తం 72 రోజుల్లో 84 సార్లు సురేశ్, నరేందర్‌రెడ్డి మధ్య సంభాషణలు జరిగినట్టు పేర్కొన్నారు. ఇక అధికారులపై దాడి జరిగిన నవంబర్ 11న ఒకే ఒకసారి ఇద్దరి మధ్య ఫోన్ సంభాషణ జరిగినట్టు వెల్లడించారు. సంఘటన జరిగిన రోజు ఒక్కసారి మాట్లాడినంత మాత్రన దానిని 84 సార్లు మాట్లాడినట్టు సీన్ క్రియేట్ చేశారు.

**రిమాండ్ రిపోర్టులో ఏ1, ఏ2కు మధ్య జరిగిన ఫోన్ సంభాషణలపై పేర్కొన్న వివరాలు**

| నం. | ఎప్పుడు | ఎన్నిసార్లు |
|---|---|---|
| 1 | 01.09.24 నుంచి 07.09.24 మధ్య | 01 |
| 2 | 08.09.24 నుంచి 15.09.24 మధ్య | 05 |
| 3 | 16.09.24 నుంచి 23.09.24 మధ్య | 04 |
| 4 | 24.09.24 నుంచి 01.10.24 మధ్య | 04 |
| 5 | 02.10.24 నుంచి 09.10.24 మధ్య | 34 |
| 6 | 10.10.24 నుంచి 17.10.24 మధ్య | 13 |
| 7 | 18.10.24 నుంచి 25.10.24 మధ్య | 13 |
| 8 | 26.10.24 నుంచి 02.11.24 మధ్య | 04 |
| 9 | 03.11.24 నుంచి 09.11.24 మధ్య | 03 |
| 10 | 10.11.24 | 02 |
| 11 | 11.11.24 | 01 |
| మొత్తం | | 84 |

### చంపేందుకు కుట్ర అంటూ కట్టు కథ

భూములు కోల్పోతున్న బాధితులతో పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడటాన్ని పోలీసులు కుట్రగా పేర్కొన్నారు. ఆయన రిమాండ్ రిపోర్టులో.. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రభుత్వ ఉద్యోగులపై కర్రలు, రాళ్లతో లేదంటే కారంపొడితో దాడులు చేయాలని, వారి ఉద్దేశ్యంలో అధికారులను హత్య చేసి, తమ భూమిని కాపాడుకునే విధంగా కుట్ర చేశారంటూ పోలీసులు పేర్కొన్నారు. రైతులను, గ్రామస్థులను దాడులకు ప్రోత్సహించింది నరేందర్‌రెడ్డి అని తెలిపారు. ప్రణాళికలో భాగంగానే సురేశ్ కలెక్టర్‌తో మాట్లాడి ఆయనను గ్రామస్థులు ఉన్న చోటికి తీసికెళ్లి, దాడి చేయించి తమ ప్లాన్‌ను అమలు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచాలనే కుట్రతోనే అధికారులపై దాడికి పాల్పడ్డామని, దీని ద్వారా రాజకీయంగా లబ్ధిపొందాలని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని ప్రయత్నించామని, తమ పార్టీ నాయకుడు కేటీఆర్, ఇతర నాయకుల ఆదేశాలతోనే ఈ కుట్ర చేశామంటూ నరేందర్‌రెడ్డి తమ విచారణలో అంగీకరించారంటూ పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అదంతా ప్రభుత్వం అల్లుతున్న కట్టుకథ అని తెలిసినప్పటికీ దానికి కుట్ర రంగు పులిమేందుకు ప్రయత్నిస్తున్నట్టు అర్థమవుతున్నది.



## రైతులను అరెస్టు చేసి కంపెనీ పెట్టగలరా?

- ప్రభుత్వాన్ని నిలదీసిన ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): గ్రామాలను దిగ్బంధించి, స్థానికులను అరెస్టు చేసి కంపెనీలు ఎలా పెడుతారని టీజీపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ప్రశ్నించారు. ఒకవేళ కంపెనీలు పెట్టినా వాటిని నడుపగలరా అని నిలదీశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూ సేకరణ అనేది చట్ట పరిధిలో ప్రజల సమ్మతితో జరుగాలని, బలవంతంగా గుంజుకోవాలనుకోవడం తగదని సూచించారు. ముఖ్యంగా ప్రైవేటు వ్యక్తులు, కంపెనీల కోసం భూ సేకరణ చేయాల్సి వచ్చినప్పుడు నిరాకరించే హక్కు ప్రజలకు ఉంటుందని గుర్తుచేశారు. లగచర్ల ఘటనలో కుట్ర దాగి ఉన్నదని అధికారులు పేర్కొనడం ఆశ్చర్యానికి గురిచేస్తున్నదని తెలిపారు. ఒకవేళ కుట్ర నిజమే అయితే అది భూములను గుంజుకునే కుట్ర అయి ఉండవచ్చని పేర్కొన్నారు. అధికారులు కూడా తాము పెట్టుబడిదారులకు ఏజెంట్లు కాదన్న విషయాన్ని గుర్తెరిగి మెలగాలని కోరారు. అధికారులపై దాడి కూడా సమర్థనీయం కాదని చక్రపాణి వెల్లడించారు.

# రైతులు, మాజీ ఎమ్మెల్యేను విడుదల చేయాలి

- ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా దౌర్భాగ్యం
- అన్ని వర్గాల్లోనూ ప్రభుత్వంపై వ్యతిరేకత
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి





హైదరాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఫార్మా క్లస్టర్‌కు భూములు ఇవ్వబోమని చెప్పిన రైతులను, వారి పక్షాన నిలబడిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఖండించారు. అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులే ప్రభుత్వంపై తిరుగుబాటు చేసే దుస్థితికి రేవంత్‌రెడ్డి సర్కార్ తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ వైఫల్యానికి ఇంతకన్నా నిదర్శనం మరొకటి లేదని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం.. ఇంటింటా దౌర్భాగ్యం అన్నట్టుగా పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇండ్లు కూలగొడతారని ప్రజలు, భూములు లాక్కుంటారని రైతులు కంటి మీద కునుకు లేకుండా ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి.. ఆడబిడ్డలు, అవ్వాతాతలు, ఆటోడ్రైవర్లు ఇలా అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్డెక్కుతున్నారని తెలిపారు. సంక్షేమ పాలన పోయి సంక్షోభ పాలన వచ్చిందని ఎద్దేవా చేశారు. కొడంగల్ ఫార్మా క్లస్టర్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.


### నడిరాత్రి అరెస్టులే ప్రజాపాలనా?:కొప్పుల

రైతులను నడిరాత్రి అరెస్టు చేయడమే ప్రజాపాలనా? అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, రైతుల అరెస్టును ఖండించారు. కక్ష సాధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ రాజ్యం అని చెప్తూనే ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తున్నదని మండిపడ్డారు. పచ్చని పొలాల్లో ఫార్మా క్లస్టర్ చిచ్చు పెట్టినందుకు ప్రశ్నిస్తే అరెస్టులా? అని మండిపడ్డారు. అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యే, రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మాజీ ఎమ్మెల్యే పట్నం అరెస్టుపై బీఆర్ఎస్ ఫైర్

రైతుల పక్షాన పోరాడినందుకే అక్రమ కేసులు • ఉమ్మడి పాలమూరులో బీఆర్ఎస్ ఆందోళనలు

మహబూబ్‌నగర్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. బుధవారం వాకింగ్‌కు వెళ్లిన పట్నంను అదుపులోకి తీసుకొని అక్రమ కేసులు బనాయించడంపై ఆగ్రహం వ్యక్తంచేశాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గులాబీ పార్టీ శ్రేణులు రోడ్లపైకి చేరి నిరసన తెలిపాయి. ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమని తేల్చిచెప్పిన రైతులకు మద్దతిచ్చిన బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సరికాదని నినదించాయి. పట్నంపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. మక్తల్, నారాయణపేట మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి పట్నం అరెస్టును ఖండించారు.



నారాయణపేట జిల్లా కోస్గిలో బీఆర్ఎస్ నేతను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

# ఓయూలో రేవంత్ దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 13: రైతుల భూమిని అక్రమంగా సేకరించేందుకు ప్రయత్నిస్తున్న అధికారులను అడ్డుకున్నందుకు 16మంది రైతులతో సహా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయటంపై నిరసనలు వెల్లువెత్తాయి. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బుధవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ ఫార్మా సిటీ కోసం కేసీఆర్ సర్కారు సేకరించిన 12 వేల ఎకరాలు సిద్ధంగా ఉన్నప్పటికీ, వాటిని కాదని తన అల్లుడి కోసం రేవంత్ ఫార్మాక్లస్టర్ల పేరిట రైతుల భూములను గుంజుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అల్లుడి కంపెనీ కోసం ప్రజలపై లాఠీచార్జి చేసి జైలుకు పంపుతున్నారని దుయ్యబట్టారు. దీనికి లగచర్ల ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన రైతులు, మాజీ ఎమ్మెల్యేను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.





ఓయూలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్వీ నేతలు



# మధుమేహానికి హైడ్రేషన్ టిప్స్

**మీకు తెలుసా ?**

టైప్ 2 డయాబెటిస్ మెల్లిటస్ (T2DM) ఉన్న పేషెంట్లు డీహైడ్రేషన్ మరియు ఎలక్ట్రోలైట్‌కు గురయ్యే అవకాశం ఉందని జర్నల్ ఆఫ్ ది అసోషియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియా (JAPI)లో ఒక అధ్యయనం ప్రచురించబడినది

**మధుమేహానికి డీహైడ్రేషన్ మరియు దాని ప్రమాదాలను గురించి అవగాహన**

మీ శరీరం తీసుకునే దానికంటే ఎక్కువ నీటిని కోల్పోయినప్పుడు డీహైడ్రేషన్ అవుతుంది, ఇది సరిగ్గా పని చేయడం కష్టతరం అవుతుంది. మధుమేహం ఉన్నవారికి ఇది చాలా ప్రమాదకరం ఎందుకంటే డీహైడ్రేషన్ వారికి ఎక్కువ ప్రమాదం. మధుమేహం ఉన్న పేషెంట్స్ హైడ్రేటెడ్‌గా ఉండుట చాలా ముఖ్యం, ఎందుకంటే
- సాధారణ శరీర ఉష్ణోగ్రతను కొనసాగించుటకు సహాయపడుతుంది
- ఫ్లూయిడ్ సమతుల్యతను నియంత్రిస్తుంది
- పోషకాలు మరియు వ్యర్థ ఉత్పత్తులను తీసుకెళ్లే చానల్‌గా పని చేస్తుంది
- ఒక లూబ్రికెంట్ మరియు షాక్ అబ్జార్బర్‌గా మధుమేహం ఉన్నవారిలో డీహైడ్రేషన్ కిడ్నీ సమస్యలతో సహా వివిధ సమస్యలకు దారి తీస్తుంది





**హైడ్రేటెడ్‌గా ఉండుటకు చిట్కాలు**

- తగినంత నీరు లేదా తక్కువ షుగర్‌తో కెఫీన్ లేని పానీయాలు మరియు తగినంత ఎలక్ట్రోలైట్స్ తాగడం ద్వారా హైడ్రేటెడ్‌గా ఉండవచ్చు.
- ఆల్కహాల్ సేవించడం తగ్గించండి, ఎందుకంటే ఆల్కహాల్ డీహైడ్రేట్‌కు దారి తీస్తుంది.
- ఎలక్ట్రోలైట్స్ మరియు శక్తి పదార్థాలను కలిగి ఉన్నందున త్రాగడానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రోలైట్స్‌ను ఎంచుకోండి.

**డీహైడ్రేషన్ లక్షణాలను గుర్తించడం**

- ప్రారంభ లక్షణాలు: దాహం, నోరు పొడిబారడం, ముదురు మూత్రం, తల తిరగడం మరియు అలసట
- తీవ్రమైన డీహైడ్రేషన్ సంకేతాలు: కంగారుపడటం, కళ్లు గుంటలు పడటం, హృదయ స్పందన రేట్ పెరగడం.

**మధుమేహంలో ఎలక్ట్రోలైట్స్ మరియు ఫ్లూయిడ్ నష్టాన్ని భర్తీ చేయుట ఎందుకు ముఖ్యమైనది**

- మధుమేహ వ్యాధిగ్రస్తులు తరచుగా అధిక చెమట లేదా తరచుగా మూత్రవిసర్జన వలన ఫ్లూయిడ్స్‌ను కోల్పోతారు, అందువల్ల కోల్పోయిన నీటిని భర్తీ చేయడం చాలా ముఖ్యం.
- సోడియం, పొటాషియం మరియు మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్స్ ఫ్లూయిడ్ సమతుల్యతను కాపాడుటలో మరియు కండరాలు మరియు నరాలు సరిగ్గా పని చేయుటకు మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తాయి.
- రెడీ-టు-డ్రింక్ (RTD) ఎలక్ట్రోలైట్ సొల్యూషన్స్ తక్కువ షుగర్‌తో అందుబాటులో ఉన్న కొన్ని ఆప్షన్స్‌తో హైడ్రేషన్‌ను కొనసాగించుటకు తగిన ఎంపిక, అది మధుమేహం ఉన్నవారికి చాలా ముఖ్యం.

**బ్లడ్ షుగర్ మరియు హైడ్రేషన్ పర్యవేక్షణ**

హైడ్రేషన్ స్థితి ఆధారంగా రక్తంలో చక్కెర స్థాయిలు మారవచ్చు మరియు డీహైడ్రేషన్ హెచ్చుతగ్గులకు కారణమవుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు రోజుకు నాలుగు సార్లు వారి బ్లడ్ షుగర్‌ను చెక్ చేసుకొనుట లక్ష్యంగా పెట్టుకోవాలి, ముఖ్యంగా వేడి వాతావరణంలో లేదా తీవ్రమైన కార్యకలాపాల అనంతరం.

**అడ్వాన్స్‌డ్ హైడ్రేషన్**

మంచి అనుభూతితో త్వరగా కోలుకోండి[1,2,3]





ORSL INDIA'S NO.1 ELECTROLYTE DRINK

మధుమేహం ఉన్న పేషెంట్స్ డీహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. తగినంత ఫ్లూయిడ్ తీసుకోకపోవడం, కఠినమైన వ్యాయామం, అధిక ఉష్ణోగ్రతలు, జ్వరం, వికారం మరియు వాంతులు డీహైడ్రేషన్ మరియు ఎలక్ట్రోలైట్ అసమతుల్యతను పెంచే అవకాశం ఎక్కువగా ఉంది. డీహైడ్రేషన్‌ను నివారించడానికి తగినంత ఎలక్ట్రోలైట్‌తో ఫ్లూయిడ్ మరియు నీరు త్రాగుట చాలా ముఖ్యం.



నాగరాజన్ రామసుబ్రమణ్యం
సీనియర్ R & D డైరెక్టర్, కెన్వ్యూ

ORSL తో సైలెంట్ డీహైడ్రేషన్ నుండి కోలుకోండి జీరో కేలరీ స్టెవియా గల రీహైడ్రేట్